www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024



తొమ్మిది మంది ఎస్‌ఐల బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో తొమ్మిది మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలు జారీ చేశారు. భీమడోలు ఎస్‌ఐ వై.సుధాకర్‌ను అదే పోలీస్ స్టేషన్‌లో నియమించగా, లక్కవరం ఎస్‌ఐ సుధీర్‌ను ద్వారకాతిరుమల బదిలీ చేశారు. ద్వారకాతిరుమల ఎస్‌ఐ గుడివాడ సతీష్‌ను ఏలూరు వీఆర్‌కు తరలించారు. తడికలపూడి ఎస్‌ఐ ఎం.జయబాబును టి.నర్సాపురం స్టేషన్‌కు బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ డిడి.మహేశ్వరరావును ఏలూరు వీఆర్‌కు తరలించారు. చింతలపూడి ఎస్‌ఐ కుటుంబరావును తిరిగి అక్కడే నియమించగా జీలుగుమిల్లి ఎస్‌ఐ వి.చంద్రశేఖర్‌ను కొయ్యలగూడెం ఎస్‌ఐగా నియమించారు. కొయ్యలగూడెం ఎస్‌ఐ జివి.విష్ణువర్ధన్‌ను వీఆర్‌కు తరలించారు. నిడమర్రు ఎస్‌ఐ ఆర్.శ్రీనును కూడా వీఆర్‌కు తరలిస్తూ ఎస్‌పి ఉత్తర్వులు జారీ చేశారు.



వైద్యం.. అరకొర..!

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలపై జనం ఆవేదన

ఏరియా ఆసుపత్రుల్లో కానరాని సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ సదుపాయం

ప్రయివేటులో చేయించాలంటే రూ.ఐదు వేల వరకూ ఖర్చు

ఆర్థికంగా భరించలేక సామాన్య ప్రజానీకం అవస్థలు

ప్రభుత్వాసుపత్రుల్లో కిడ్నీ, గుండె సంబంధిత డాక్టర్ లేక అవస్థలు

కష్టార్జితమంతా ఆసుపత్రులకే అంటూ జనం గగ్గోలు

'నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన సత్యనారాయణ తల తిరుగుతుందని ఆసుపత్రికి వెళ్లగా ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించుకోవాలని డాక్టర్ రాసిచ్చారు. ప్రయివేటు సెంటర్‌లో అడిగితే రూ.ఐదు వేల వరకూ ఖర్చవుతుందని చెప్పారు. పనికెళ్తే తప్ప ముద్దకు సాగని సామాన్య కుటుంబం సత్యనారాయణది. దీంతో ప్రభుత్వాసుపత్రిలో చూపించుకోవాలని భీమవరం, తాడేపల్లిగూడెం ఆసుపత్రుల్లో సంప్రదించగా ఇక్కడ సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ లేదని తెలిపారు. దీంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్‌ఐ చేయిం చుకునేందుకు వస్తే 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు.'

'ఏలూరు రూరల్ గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళకు తలంతా తీవ్రమైన నొప్పి వస్తుందని ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లింది. ఎంఆర్‌ఐ స్కానింగ్ రాసిచ్చారు. అంత సొమ్ము ఖర్చు చేసే ఆర్థిక పరిస్థితి లేక ప్రభుత్వాసుపత్రికి వెళ్తే రెండు వారాలు పడుతుందని రాసిచ్చారు. అదేమని అడిగితే రెండు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రావడంతో ఎంఆర్‌ఐ స్కానింగ్‌కు 15 రోజులు పైనే సమయం పడుతుందని చెబుతున్నారు. ప్రయివేటు సెంటర్లలో చేయించుకోలేక ఇచ్చిన సమయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాసుపత్రుల్లో అరకొర సదుపాయాలతో రెండు జిల్లాల్లో రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంఆర్‌ఐ, సిటీ స్కానింగ్ వంటివి ఏర్పాటు చేయకపోవడంతో సామాన్య ప్రజానీకం ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెండు జిల్లాలవ్యాప్తంగా తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, నూజివీడు, తణుకు, భీమవరం, పాలకొల్లు, భీమడోలు వంటి పట్టణాల్లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఎక్కడా సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ సదుపాయం లేదు. ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో మాత్రమే సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ ఉన్నాయి. రెండు జిల్లాల ప్రజలు ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించుకోవాలంటే ఏలూరు ఆసుపత్రికి రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో స్కానింగ్ చేయించుకోవాలంటే 15 రోజులకుపైగా సమయం పడుతోంది. రోగం భరించలేక ప్రయివేటు సెంటర్లలో రూ.వేలు చెల్లించి స్కానింగ్ చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు మారుతున్నా సామాన్య ప్రజానీకం వెళ్లే ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యసేవల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ వెయ్యి మందికిపైగా రోగులు వస్తుంటారు. జిల్లాలోని ప్రతి ఏరియా ఆసుపత్రికి వందల సంఖ్యలో రోగులు నిత్యం వస్తుంటారు. కేరళ వంటి రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల్లో అవయవ మార్పిడి వంటి సదుపాయాలు సైతం అందుబాటులో ఉండగా మన దగ్గర మాత్రం సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ సదుపాయాలు సైతం ఉండని పరిస్థితి. మారిన జీవన విధానంలో అనేక రోగాలు చుట్టుముడుతున్నాయి. ఇటీవల రెండు జిల్లాల్లో అత్యధికంగా కిడ్నీ, బ్రెయిన్‌కు సంబంధించిన రోగాలతోపాటు, కేన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలు జనాన్ని చుట్టుముడుతున్నాయి. దీంతో ఆసుపత్రికెళ్తే ఎంఆర్‌ఐ, సిటీ స్కానింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రయివేటు సెంటర్‌లో చేయించుకోవాలంటే సిటీ స్కానింగ్‌కు రూ.2,500, ఎంఆర్‌ఐ స్కానింగ్‌కు రూ.ఐదు వేల వరకూ తీసుకుంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో స్కానింగ్, రక్తపరీక్షలు, మందులకు తక్కువగా లెక్కించినా రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేల వరకూ ఖర్చవుతుంది. ఇదంతా ఒక్కసారి ఖర్చు మాత్రమే. ఆ తర్వాత నిరంతరం ఖర్చు తప్పని పరిస్థితి ఉంటోంది. దీంతో వైద్యం ఖర్చు సామాన్యులకు భారంగా మారింది. ఆరోగ్యశ్రీ వంటి సదుపాయాలు ఆపరేషన్ వంటి రోగాలకు వర్తిస్తున్నాయే తప్ప, పరీక్షలకు వర్తించడం లేదు. దీంతో సామాన్యుల కష్టం వైద్యఖర్చులకు చాలడం లేదు. దీంతో అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం ప్రతి ఏరియా ఆసుపత్రిలో సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ సదుపాయాలతో పాటు అన్ని రకాల పరీక్షలు అందుబాటులో తీసుకురావాలని జనం కోరుతున్నారు. అంతేకాకుండా జిల్లాలో ఏ ఒక్క ప్రభుత్వాసుపత్రిలోనూ కిడ్నీ, గుండె సంబంధిత డాక్టర్లు లేరు. దీంతో సామాన్య ప్రజానీకం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని అంతా కోరుతున్నారు.



వట్లూరు-పెదపాడు రోడ్డులో రాస్తారోకో చేస్తున్న రైతులు, రైతు సంఘం నేతలు

సాగునీటి కోసం రోడ్డెక్కిన కృష్ణా ఆయకట్టు రైతులు

వట్లూరులో రాస్తారోకో - వరి నారుతో నిరసన

కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరందించాలని డిమాండ్

ప్రజాశక్తి - పెదపాడు

సాగునీటి కోసం కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు వట్లూరులో రోడ్డెక్కారు. సాగునీరు అందించాలంటూ వట్లూరు-పెదపాడు రోడ్డులో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. నీరు లేక నాట్లు వేయని పంట భూముల్లో, ఎండిపోతున్న వరి నాట్లను చేత పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే కృష్ణా డెల్టా రైతులకు సాగునీరందక, వరినాట్లు వేయలేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కెఇ కెనాల్‌ను ఆధునికీకరించకపోవడం వల్ల కర్రనాచు, తూడు, గుర్రపు డెక్క పెరిగిపోయి నీరు పారుదల లేక శివారు ప్రాంత భూములకు అందడం లేదన్నారు. వేసవిలో చేయాల్సిన కాలువ పనులు ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంతో నిర్వహించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. నాట్లు ఇప్పటికే బాగా ఆలస్యమయ్యాయని, ఇప్పుడు కాల్వ బాగు చేసి నీళ్లిస్తామని అధికారులు చెప్పడంలో అర్థం లేదన్నారు. పెదపాడు మండలంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. వట్లూరు ఆయకట్టు పరిధిలో మూడు వేల ఎకరాలు నారు ఎదిగినా నాట్లు వేయకపోవడంతో బీడు భూములుగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జలవనరుల శాఖాధికారులు స్పందించి నాట్లు వేసుకునే విధంగానైనా యుద్ధప్రాతిపదిక సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కొమ్మన సాంబశివరావు, తుమ్మల ధన కోటేశ్వరరావు, కొమ్మన శ్రీహరిరావు, కొమ్మన రామబ్రహ్మం, ఆళ్ల శ్రీరాములు, పర్వతనేని నాగభూషణం, దారం యోహానురాజు, కెఎస్ఎన్.మూర్తి, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, ఎస్‌వి.సుబ్బారావు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో ఇంటర్ విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం స్నానానికి దిగిన ఇంటర్ విద్యార్థి గల్లంతయ్యాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు పాతూరుకు చెందిన కొల్లి జాన్‌బాబు (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆరుగురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు ఆదివారం ఉదయం వచ్చాడు. ఈ క్రమంలో సముద్రంలో స్నానం చేస్తుండగా అలల ఉధృతికి లోపలకు కొట్టుకెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న జాన్‌బాబు కుటుంబ సభ్యులు, బంధువులు బీచ్‌కు వచ్చారు. జాన్ బాబు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.



వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



నిడమర్రు : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కలిదిండి


వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని మూలలంకలో విరాళాల సేకరణ చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు వీరవల్లి భాస్కరరావు, ఎస్ఎన్‌వి.సత్యనారాయణ, గద్దె అనిల్ కుమార్, బుస్సా రామ నాగేంద్రం, దాసరి సురేష్, శేషపు మహాలక్ష్మి, ఎస్.సతీష్‌కుమార్, కొల్లి సతీష్, నాయన బాబు, సాయి పాల్గొన్నారు.

యలమంచిలి :ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ప్రకృతి వలయంలో ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోవడమే కాకుండా వందలాది మందికి ప్రాణనష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలకు సహాయార్థం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికుల నుంచి రూ.20 వేల 771 విరాళాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ విరాళాలను అడిగిన వారందరూ సహృదయంతో స్పందించి తమకు తోచిన విధంగా విరాళాలను అందించి మానవత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జార్జి, పి.వెంకటస్వామి, మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండలు, శ్రీనివాస్, కోరం వెంకటేశ్వరరావు, ముమ్మిడివరపు ఆంజనేయులు, డివైఎఫ్ఐ నాయకులు తెన్నేటి స్టాలిన్, పల్లేరు అనిల్, పల్లేరు ఆనంద్, భారతుల రాజేష్, చెట్టిమి వానబాలుడు, ఆకుమర్తి జోసెఫ్, తెన్నేటి జయరాజు, జున్ను పాల్గొన్నారు.

సిపిఎం విరాళాల సేకరణకు మంత్రి నిమ్మల స్పందన

రూ.1000 విరాళం అందజేత


మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై ఆదివారం కేరళ వయనాడ్ బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్న సమయంలో వేరే కార్యక్రమంలో పాల్గొని అదే రహదారిపై కాన్వాయ్‌లో వెళుతున్న రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తన కాన్వాయ్‌ను తనంతట తాను ఆపారు. సిపిఎం నాయకులు చేస్తున్న విరాళాల సేకరణ గురించి అడిగి తెలుసుకుని, వారిని అభినందించడమే కాక తన వంతుగా రూ.వెయ్యి విరాళాన్ని అందించారు.



యలమంచిలి : సిపిఎం నాయకులకు విరాళాన్ని అందిస్తున్న మంత్రి నిమ్మల

'చింతలపూడి'ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్



ఎంఎల్ఎను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి తాను అహర్నిశలు కృషి చేస్తానని, దానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వికెఎం ఫంక్షన్ హాలులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఎంఎల్ఎ, ఆర్యవైశ్య సంఘ పెద్దలు కలిసి జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడంలో ఆర్యవైశ్య సోదరులు కీలక పాత్ర పోషించారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఆర్యవైశ్య సోదరులకు అన్ని సహకారాలు అందిస్తానని, అధికారుల నుండి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చింతలపూడి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఎంఎల్ఎను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇ-చలానాలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు నగరంలో ఆటోలపై విధించిన ఇ-చలానాలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పది శాతానికి మించకుండా తెలంగాణ తరహాలో రద్దు చేయాలని బి.సోమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దెందులూరు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశానికి ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపీ, సిహెచ్.అమర్ కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.సోమయ్య మాట్లాడుతూ ఏలూరు నగరంలో యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేవని, పరిశ్రమలు కొత్తవి రాకపోగా ఉన్నవి కాస్త మూతపడ్డాయని, దీంతో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న యువత ఏ ఉపాధి లేక తమ సొంత పెట్టుబడితో ఆటో డ్రైవర్లుగా ప్రజలకు సేవలందిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రూ.వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరుస్తున్నారని, రవాణా రంగ కార్మికులకు రక్షణ కల్పించేలా సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలోని ఆటో డ్రైవర్లకు లైసెన్స్, ఫిట్‌నెస్ రెన్యువల్‌కు ఆర్‌టిఒ అధికారులు సహకరించాలని కోరారు. ఏజెంట్లు మధ్యవర్తులుగా ఏర్పడి డ్రైవర్ల వద్ద వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, దీనిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధిగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లపై ప్రభుత్వం ఆర్‌టిఒల ద్వారా టార్గెట్లు విధించి జరిమానాలు వసూలు చేయడం సరికాదని విమర్శించారు. ఏలూరు నగరంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వాటిని వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆటో డ్రైవర్లందరిని సమీకరించి ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశా నికి అడ్డాల రాజు, గడ్డం పాపారావు, కె.నారాయణ, ఎస్.శ్రీని వాసరావు, కట్టా గోపీ, కమిటీ సభ్యులు నాయకత్వం వహించారు.

దొంతవరం, నూతలకోడు మురుగుబోదెల ఆక్రమణ

వందలాది ఎకరాల్లో నేటికీ ముంపులోనూ వరి చేలు

మునిగిన రెండోసారి వేసిన నారుమడులు

అనధికార చేపల చెరువుల కోసం తూరల వల్లే ముంపు

ఆక్రమణలను పట్టించుకోని డ్రెయినేజీ శాఖ




దొంతవరం డ్రెయిన్‌పై అక్రమ తూరలు



తూడుతో పేరుకుపోయిన దొంతవరం మేజర్ డ్రెయిన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని దొంతవరంలో దాదాపు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆకుమడులు పోసి వరి నాట్లు వేసుకునే తరుణంలో వర్షాలకు పొలాలన్నీ నిండా మునిగిపోయాయి. చేలల్లో నీరు దిగువకు వెళ్లే దారులన్నీ మునిగిపోయాయి. దీంతో నారుమడులు కుళ్లిపోయి దెబ్బతిన్నాయి. వర్షాలు తగ్గిన తరువాత రెండోసారి నారుమళ్లు రైతులు పోసుకున్నారు. ఈసారి కూడా రెండోసారి వచ్చిన వరద నీటికి నారుమళ్లు అన్నీ కొట్టుకుపోయాయి. చేలల్లో ఎక్కడ చూసినా మూడు నుంచి నాలుగు అడుగుల లోతు నీరుంది. నీరు తగ్గితే కాని వరి నాట్లు వేయటానికి అవకాశం లేకపోవడంతో క్రాప్ హాలీడే తప్పదేమో అనే ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. దొంతవరం - సీతారాంపురం మీదుగా దొంతవరం మురుగు కాలువలో నీరంతా ప్రవహిస్తూ నూతలకోడు సైఫన్ వద్ద నుంచి పందికోడు ప్రధాన మురుగు కాలువలోకి నీరంతా కలవాల్సి ఉంది. ఈ పొలాలకు మురుగు, సాగు నీటిని తీసుకెళ్లే దొంతవరం, నూతలకోడు మురుగు బోదెలు పూడుకుపోవడం, పలు చోట్ల చేపల చెరువుల నిర్వాహకులు అనధికార తూరలు, దారులు ఏర్పాటు చేయడంవల్ల వర్షాకాలంలో అధిక వరద దిగువకు వెళ్లడం లేదు. దీంతో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు నేటికీ ఈ గ్రామంలో 150 ఎకరాల ఆయకట్టు ముంపులోనే ఉంది. మొదటి సారి కురిసిన వర్షాలకు ఆకుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. తిరిగి రెండోసారి ఆకుమడులు పోసుకున్నా రెండోసారి పడిన వర్షాలకు అవికూడా కొట్టుకుపోయాయి. ప్రస్తుతం చేలల్లో మోకాల లోతు వరద నీరు నిలిచిపోయి నాచు, తామర ఆకులు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో రైతులంతా ఈ నెల మూడో తేదీ రాత్రి ఎంఎల్‌ఎ ధర్మరాజును కలిసి తమ గోడును చెప్పుకున్నారు. ఆక్రమణలను తొలగించి పూడికతీత, కాలువలు ప్రక్షాళన చేయకపోతే క్రాప్ హాలీడే ప్రకటించి దారుణమైన పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన వక్తం చేస్తున్నారు.



తామర మొక్కలు మొలిచిన దొంతవరం పొలాలు

ఆక్రమణలే పొలాల ముంపునకు ప్రధాన కారణం

కాటి కిరణ్‌కుమార్, రైతు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు



దొంతవరంలో సుమారు 60 మంది సన్న చిన్నకారు రైతులే 150 ఎకరాల్లో వరి పంటను పండిస్తున్నారు. భారీ వర్షాలకు పొలాల్లో వరద నీరు చెరువులను తలపించేలా మునిగిపోయింది. వర్షాలు తగ్గి దాదాపు 20 రోజులు పైనే గడచినప్పటికీ మడుల్లో రెండు అడుగుల వరకు నీరు నిలిచే ఉంది. చేపల చెరువుల్లో మురుగునీరు కూడా ఇందులోనే కలుస్తోంది. తామర మొక్కలు, తూడు, నాచులతో వరి పొలాలు నిండిపోయియి. పొలాల్లో అధిక నీరు దొంతవరం మురుగు కాలువ నుంచి సీతారాంపురం మీదుగా సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తూ నూతలకోడులో కలిసి పందికోడు ప్రధాన మురుగు కాలువలో కలవాల్సి ఉంది. ఎక్కడికక్కడ ఆక్రమణలు, అనధికార తూరల వల్లే నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి నేటికీ చేలు చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీ శాఖ వీడ్ క్లీనింగ్ పేరిట కలుపు మందు పిచికారీ చేయించడం వల్ల సమస్య పరిష్కారం కాదు. శాశ్వత పరిష్కారం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి.

రెండు సార్లు వేసిన నారుమడులు కొట్టుకుపోయాయి

కొమ్ము కార్తీక్, చిన్నకారు రైతు, దొంతవరం



నేను మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. నారుమడి సిద్ధం చేసి విత్తనాలు చల్లాను. ఇంతలోనే వరదలకు నారుమడి పూర్తిగా పాడైపోయింది. రెండోసారి కూడా నారుమడిలో విత్తనాలు చల్లాను. అవికూడా మొలకెత్తేలోపే వరదలకు పాడైపోయాయి. ఇంకా మూడో సారి ఆకుమడులు అనుమానమే. ఇలాంటి పరిస్థితిలో ఈ సీజన్ పంట పోయినట్టే. పెట్టుబడులు నష్టపోయాం. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

పంటను కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కాలి చిరంజీవి, రైతు, దొంతవరం



వ్యవసాయమే ఆధారమైన గ్రామం మాది. పంటలు లేకపోతే ఇటు కూలీలు, రైతులు ఎలా బతికేది. ఉన్న కొద్దిపాటి పొలం సాగుచేద్దామంటే మురుగు కాలువల పూడిక, ఆక్రమణల వల్ల దిగువ కు నీరెళ్లే మార్గాలు లేక మా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇలాంటి దుస్థితిలో ఈసారి పంటలు పండడం కష్టమే. బాధిత రైతులను గుర్తించి ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి.

అనధికార తూరలను యుద్ధ ప్రాతిపధికన తొలగించాలి

కంభంపాటి సూరిబాబు, రైతు దొంతవరం



దొంతవరం మురుగు కాలువ మీద సీతారాంపురం సమీపంలో పత్తేపురానికి చెందిన ఓ రైతు అనధికారికంగా తూరలు పెట్టి పైనుంచి కంకరతో చేపల చెరువుకు దారి వేశారు. దానివల్లే ప్రధానంగా మా ఆయకట్టు పొలాలన్నీ నేటికి ముంపు బారిన ఉన్నాయి. ముందు యుద్ధ ప్రాతిపదికన ఆక్రమ కట్టడాలు, తూరలను తొలగిస్తే కాని మా చేలల్లో వరద నీరంతా దిగువకు లాగే అవకాశాలు లేవు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టకపోతే మా గ్రామ రైతులంతా అక్రమ కట్టడాల వద్ద ఆమరణ నిరాహార దీక్షలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

తూడు తొలగింపు (వీడ్ క్లీనింగ్) చేపట్టాం

డ్రెయినేజీ శాఖ ఎఇ సత్యనారాయణ

దొంతవరం మురుగు కాలువలో తూడు తొలగించేలా కలుపు మందును పిచికారీ నాలుగు రోజుల కిందట కూలీలతో చేయించాం. కాలువను తవ్వి పూడిక తీసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపిస్తాం.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యతోనే అన్ని సాధ్యమవుతాయని, విద్యార్థి దశ నుంచి కష్టపడి విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరు కునేందుకు సులువైన మార్గం ఏర్పడుతుందని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది పిల్లలకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందించే కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, నగదు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా పోలీసు సిబ్బంది పిల్లలకు వారి ప్రతిభను గుర్తించి ప్రతిభా పురస్కారాలను అందించడం సంతోషకరమన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, నగదు పురస్కారాలను అందించామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే విద్యలో అత్యంత ప్రతిభ కనబరిస్తే జీవితం అనుకున్న విధంగా మెరుగులు దిద్దుకుంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. తాను విద్యార్థి దశ నుంచే ఎన్నో ఒడిదుడుకులను ఎ దుర్కొని ఐపిఎస్ స్థాయికి చేరుకున్నానని చె ప్పారు. విద్యార్థులు ఎవరైనా సందేహాలు ఉన్నా సలహాలు కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి, ఎఆర్ డిఎస్‌పి శ్రీహరి, ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, జిల్లా పోలీస్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయక్, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌తో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం పంచాయతీ కమ్మరిగూడెం గ్రామానికి చెందిన మరపట్ల భవ్య ఈ ఏడాదిలో రెండుసార్లు రోడ్డు ప్రమాదంలో గాయపడింది. వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న వారి కుటుంబానికి ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు జి.గణేష్, షహేన్నా భాష, పోతుల చిరంజీవి, కె.రాంబాబు, చిలక రాంబాబు, ఎస్.మోహన్ పాల్గొన్నారు.

యామిని కృష్ణమూర్తి మృతి కళారంగానికి తీరనిలోటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

భరతనాట్యంలో జాతీయ స్థాయిలో పేరుగాంచిన సీనియర్ కళాకారిణి యామిని కృష్ణమూర్తి మృతికి ఎపి ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గౌరవాధ్యక్షుడు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు, ఏలూరు జిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ టివిఎస్.రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందిన ఆమె ప్రఖ్యాత భరతనాట్యంలో జాతీయస్థాయితో పాటు పలు అవార్డులు పొందారన్నారు. యామిని మృతికి మహిళా బుర్రకథ కళాకారిణి విభూది రాజేశ్వరి, ఎం.ప్రేమానందం, సీనియర్ కోలాట కళాకారుని బొందలపాటి పద్మావతి, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు, రంగస్థల సీనియర్ కళాకారుడు తిరుపతి రమేష్ బాబు సంతాపం తెలిపారు.

ముసునూరులో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

సేవ చేయాలనే ఉద్దేశంతో, సేవా దృక్పాథంతో మండల కేంద్రమైన ముసునూరులో దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యులు దేవిశెట్టి దినేష్‌బాబు డెంటల్ సర్జన్ చెప్పారు. మండల కేంద్రమైన ముసునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెన్ను బసవయ్య ఖాళీ స్థలంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించామని తెలిపారు. పలువురిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నూజివీడు, విజయవాడ ఏరియా ఆసుపత్రులకు సిఫార్సు చేసినట్లు డాక్టర్ దినేష్‌బాబు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

ఆపన్నులను ఆదుకోవాలి : ఎంఎల్ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇతరులకు సాయం అవసరమైనప్పుడు ఆదుకునేందుకు దాతలు సేవాదృక్పాథంతో ముందుకు రావాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పిలుపునిచ్చారు. అటువంటి సేవలు ఎంతోమందికి ఉపయుక్తమవ్వడంతో పాటు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజా వినతులు స్వీకరించిన ఆయన ఆయా సమస్యలను పరిష్కారించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. అలాగే ఇటీవల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న చిన్నారి జ్ఞానేశ్వరి వైద్య సహాయం నిమిత్తం గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కును, కోట సత్యనారాయణ బృందం రూ.34,600 అందించగా, వారిని ఎంఎల్ఎ చంటి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సేవలందించేందుకు దాతలు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు అమరావతి అశోక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి గ్రామంలోని బిసి ఏరియాలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలాన్ని నూజివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ నూరాని, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి ఆదివారం పరిశీలించారు. గ్రామ సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిడిపిఒ నూరాని, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.



వీధికుక్కలు.. ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు గ్రామంలో కుక్కల బెడదతో వీధుల్లోకి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. చిన్నారుల దగ్గర నుంచి మంచానపడ్డ వృద్ధుల వరకు అందరిపైనా వీధి కుక్కలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. కనిపించిన వారి కనిపించినట్లు కరుస్తూ వీధుల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఒక్కోసారి ఒకటి కంటే ఎక్కువ కుక్కలు దాడులు చేసిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కుక్కల బెడదతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కలను పట్టుకుని పెల్లర్లలో వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్యవైశ్య మండలాధ్యక్షునిగా కిషోర్

ప్రజాశక్తి - చాట్రాయి

ఎన్‌టిఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చాట్రాయి మండలం ఆర్యవైశ్య సమావేశం ఆదివారం చాట్రాయిలోని గొళ్ల సత్యంబాబు ఇంటి ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో చాట్రాయి మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన నడిపల్లి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా గొర్రెపాటి సుబ్బారావును, కోశాధికారిగా చవ్వా నాగాంజనేయరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా గౌరవ అధ్యక్షులు రఠికంటి రామచంద్రరావు, ఎన్‌టిఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ల చిన్నసత్యంబాబు, చాట్రాయి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గొళ్ల సత్యనారాయణబాబు, ఎన్‌టిఆర్ జిల్లా వాణిజ్య కమిటీ ఛైర్మన్ నాళ్ల లక్ష్మణరావు, గంపలగూడెం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వేములపల్లి రామకృష్ణారావు, చాట్రాయి ఆర్యవైశ్య ప్రముఖులు గొళ్ల మోహన్‌రావు, మాజీ ఆర్యవైశ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జల్లిపల్లి వరప్రసాదరావు, చాట్రాయి మండలంలోని వివిధ గ్రామాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రయివేట్ విద్యాసంస్థల బస్సుల టైర్లు, బ్యాటరీల చోరీ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కామవరపుకోట ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలంలో రెండు ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులు ఉండగా, జూలై 28వ తేదీ రాత్రి నలుగురు వ్యక్తులు కలిసి బస్సులకు ఉన్న ఎనిమిది టైర్లు, రెండు బ్యాటరీలు, ఒక జాకీ చోరీ చేసినట్లు తెలిపారు. బస్సు యజమాని సందిగామ ధర్మరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, సిఐ ఆ.రాజేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ జయబాబు, ఎఎస్ఐ స్వామి తన సిబ్బందితో ఈ నెల మూడో తేదీన తడికలపూడిలో ఉన్న విజయ్ మిల్క్ డెయిరీ వద్ద జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న మహేంద్ర ట్రక్కు వాహనంలో కామవరపుకోట మండలంలోని చెందిన నిందితులైన కుచ్చులపాటి చందు, కొల్లా ఈశ్వర్ కుమార్, పొలగాని సాయిదుర్గారావు, బొద్దు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. చోరీ గురైన సొత్తు విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసు త్వరితగతిన చేధించిన ఎస్ఐ జయబాబును, సిబ్బందిని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ అభినందించారు.

వర్షమొస్తే ఆ గ్రామానికి కష్టాలే..!


మెతుకుమెల్లిగూడెం వాస్తుల అవస్థలు
వర్షం కురిస్తే తలెత్తుతున్న విద్యుత్, తాగునీటి సమస్యలు
అపారిశుధ్యంతో విజృంభిస్తున్న దోమలు
విద్యార్థులకు తప్పని అవస్థలు



అపారిశుధ్యంగా వాటర్ ట్యాంకు ప్రాంతం

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షం కురిస్తే ఆ గ్రామ పాఠశాల ఆవరణలో మోకాలి లోతు వరకు నీరు నిలిచి ఉంటుంది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. విద్యార్థులు దోమ కాటుకు గురై రోగాల బారిన పడతారని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరుతున్న ట్యాంకు

వర్షం కురిసి ఆగిపోయిన తర్వాత రోజుల తరబడి వర్షపు నీరు పాఠశాల గ్రౌండ్‌లో నిలిచి ఉంటుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలం యర్రగుంటపల్లి గ్రామ పంచాయతీ మెతుకుమెల్లిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చిందంటే చాలు చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. మొత్తంగా బురదగా ఉండడంతో విద్యార్థులు ఆడుచుకునేందుకు కనీసం నడిచేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో తమ పిల్లలు రోగాల బారిన పడతారని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా, బురదగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చూడాలని, విద్యార్థులు ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



అపరిశుభ్రంగా, బురదమయంగా పాఠశాల ఆవరణం

గ్రావెల్ పోసి సమస్యను పరిష్కరిస్తాం
ఎంఇఒ రామారావు

మెతుకుమెల్లిగూడెం ఎంపిపిఎస్ పాఠశాల ఆవరణ గ్రావెల్ మట్టి పోసి నీరు నిల్వ లేకుండా, బురదగా లేకుండా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

వర్షం వస్తే మూడు రోజుల విద్యుత్ సరఫరా కట్

మెతుకుమెల్లివారిగూడెం గ్రామంలో చిన్నపాటి వర్షం వస్తే చాలు మూడు రోజుల వరకు విద్యుత్ సరఫరా రాని పరిస్థితి. పైపు లైన్ లీకై వర్షం వచ్చినప్పుడు బురద నీరు మంచినీటిలో కలుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. చిన్నపాటి గాలి, వర్షం వస్తే దాదాపుగా వంద కుటుంబాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీంతో పాటు తాగునీటి సమస్య కూడా నెలకొంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్, తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నా స్పందించడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, తాగునీరుకు బోరు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుతుందని, ఆ ట్యాంకు ఎప్పుడు శుభ్రపరిచారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో కనీసం బ్లీచింగ్ చల్లడం, శానిటేషన్ చేయించడం వంటి పనులు అధికారులు చేయించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామప్రజల సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాటం

రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజా క్షేత్రంలో కమ్యూనిస్టు పార్టీ తమ బాధ్యత గుర్తెరిగి ప్రజల పక్షాన పోరాడుతూ పేద ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూర్చే విధంగా నిర్మాణాత్మకమైన పాత్ర పోషిస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సిపిఐ ఏలూరు జిల్లా సర్వసభ్య సమావేశం సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరావు అధ్యక్షతన ఏలూరులోని స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశర్వరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రజలతో మమేకమై అనేక ఒడిదుడుకులు అధికమించి ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపుతుందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చలసాని రామారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, జిల్లాలోని సిపిఐ అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కన్వీనర్ జయరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కన్వీనర్ కుందేటి జయరాజు డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం సిఐటియు కార్యాలయంలో వికలాంగుల జాతీయ వేదిక గౌరవ అధ్యక్షులు ఎస్.రాం బాబు అధ్యక్షతన కొయ్యలగూడెం మండల వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ వికలాంగులకు రాష్ట్రంలో అన్ని బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని కోరారు. పెన్షన్ రూ.ఆరు వేలు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొయ్యలగూడెం మండల కన్వీనర్‌గా మౌనిక కుమారి నియమితులయ్యారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో మౌనిక కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం 250 దోమ తెరలు అందజేత


జనసేన నాయకులకు ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అభినందన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపునకు గురైన గ్రామస్తులకు అందించేందుకు జనసేన బుట్టాయగూడెం మండల నాయకులు 250 దోమ తెరలను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు అందించారు. బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ బాలరాజు ఆదివారం జనసేన నాయకులు కలిసి దోమ తెరలనుఅందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి పొంగి వేలేరుపాడు, కుక్కునూరు గ్రామాలు పూర్తిగా జలమయం అయ్యాయన్నారు. ఈ వర్షాల వల్ల వరద బాధితులుగా మారిన ప్రజల చుట్టూ ఉన్న అపరిశుభ్ర వాతావరణంలో దోమలు కుట్టడం వల్ల అనారోగ్యం పాలవుతారని గ్రహించి వరద బాధితులకు దోమతెరలు ఇవ్వడానికి ముందుకు రావాలని బుట్టాయగూడెం జనసేన నాయకులను కోరగా అడిగిన వెంటనే స్పందించి 250 దోమతెరలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివగంగాభవాని, రవి వర్మ, ఫణి, రవీంద్ర, శ్రీకాంత్, శివాజీ పాల్గొన్నారు.

రైతులకు సాగు నీటి కష్టాలు తొలగిస్తా

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్



మాట్లాడుతున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

సాగునీటి కష్టాలను తొలగించి రైతాంగానికి అండగా ఉంటామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ రైతులకు భరోసా ఇచ్చారు. మరమ్మతుల నిమిత్తం నాలుగు రోజుల పాటు కృష్ణా కెనాల్‌లో నీటి సరఫరా నిలిపివేతకు రైతులు సహకరించాలని కోరారు. పెదపాడు మండలంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదివారం పర్యటించారు. వసంతవాడ నుంచి తోటగూడెం వరకు కృష్ణా కెనాల్‌ను ఆయన పరిశీలించారు. తూములు అధ్వాన్న స్థితిలో ఉండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ స్థానిక రైతులు చింతమనేనికి వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ సత్వరమే కృష్ణా కెనాల్ మరమ్మతులు చేపట్టాలని, గుర్రపు డెక్క సహా పలు అవాంతరాలను తొలగించి రైతులకు నీటి ప్రవాహం యథేచ్ఛగా జరిగేలా చూడాలని సూచించారు. కృష్ణా కెనాల్ మరమ్మతుల నిమిత్తం నాలుగు రోజుల పాటు అధికారులు నీటి ప్రవాహం నిలుపుదల చేస్తారని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని, గ్రామాల్లో రైతులకు ఈ సమాచారం సమగ్రంగా చెరవేసేలా కూటమి నాయకులు చొరవ చూపాలని చింతమనేని ప్రభాకర్ సూచించారు. అనంతరం తోటగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న పలువురు పార్టీ నాయకులను పరామర్శించారు. అనంతరం గ్రామ వీధుల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. డ్రెయిన్లు సహా పలు సమస్యలను మహిళలు ఎంఎల్ఎ చింతమనేని దృష్టికి తీసుకొచ్చారు. సత్వరమే చర్యలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు - విజయవాడ కృష్ణా కాలువకు చివరి ఆయకట్టులో ఉన్న సీతంపేట కెనాల్, ఏలూరు రూరల్, పెదపాడు అయకట్టులోని ప్రాంతాల రైతులు సాగునీటి కొరతతో సమస్యలు తలెత్తడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువలో దట్టంగా గుర్రపుడెక్క, బద్దనాచు, కర్ర పెద్దఎత్తున ఉందని, దీనిని తొలగించేందుకు ట్రాక్టర్లతో దమ్ము చేయాల్సిన అవసరముందని అధికారులకు సూచించామన్నారు. వారి సూచన మేరకు నేటి నుంచి నాలుగురోజుల పాటు నీటిని నిలుపుదల చేసి కాలువలో అడ్డంకులను తొలగించి ఈ సీజన్ మొత్తం సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గుత్తా అనిల్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వాళ్లకో రూల్, వీళ్లకో రూల్ పెట్టడం తప్పు కాదా?

ముదినేపల్లిలో పంచాయతీ స్థలాల ఆక్రమణలు




గురజ రోడ్డులో డ్రెయినేజీ పూడ్చి వేసి నడుపుతున్న కర్రిపాయింట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఏదో పవన్ కళ్యాణ్ సినిమాలో పాట మాదిరిగా వాళ్లకో రూల్, వీళ్లకో రూల్ పెట్టడం తప్పు కాదా అన్న చందంగా ముదినేపల్లి సెంటర్ తయారైందని జనం అంటున్నారు. మండల కేంద్రంలోని ముదినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొందరు బడాబాబులు, అక్రమార్కులు పంచాయతీ స్థలాలను, డ్రెయినేజీలను ఆక్రమించుకుని పక్కా కట్టడాలు నిర్మించి దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరి కొంతమంది తమ షాపుల ముందు, తమ ఇళ్ల ముందు ఉన్న ప్రభుత్వ, గ్రామపంచాయతీ స్థలాలు వారి పట్టా భూములైనట్లుగా చిరు వ్యాపారులకు విక్రయిస్తుండగా, కొందరు నెలవారి, రోజువారి అద్దెలకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా జగమెరిగిన సత్యమైనప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పంచాయతీ పాలకవర్గం ఊరకుండిపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక గురజ రోడ్డులో డ్రెయినేజీలు ఆక్రమించి వాటిపై పక్కా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులకు నోటీసులు జారీ చేసి డ్రెయినేజీలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించారు. అనంతరం ఈ ప్రాంతంలో మురుగునీరు పారుదలకు ఆటంకం లేకుండా పక్క సీసీ డ్రెయిన్ నిర్మాణం కూడా చేపట్టారు. అయితే రోడ్డుకు రెండో వైపు ఉన్న ఆక్రమణలను తొలగించకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుకు రెండో వైపు కొందరు వ్యాపారులు డ్రెయినేజీని పూర్తిగా పూడ్చివేశారు. డ్రెయినేజీపై కర్రిపాయింట్, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో డ్రెయినేజీ కనుమరుగైంది. అన్నవరం రోడ్డు మలుపు నుంచి గ్యాస్ కంపెనీ వరకు డ్రెయినేజీ పూర్తిగా కనుమరుగు కావడంతో మురుగు, వర్షపు నీరు బయటకు పారే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతుంది. దీంతో విద్యార్థులు, వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో వ్యాపారులు మా వైపు ఆక్రమణలు తొలగించారు. రెండో వైపు డ్రెయినేజీ పూడ్చివేసి వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోరా, ఆక్రమణలు తొలగించరా, వాళ్లకో రూల్, మాకో రూల్ పెట్టడం తప్పు కాదా అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ వైపు కూడా ఆక్రమణలు తొలగించి మురుగునీరు బయటికు పోయేలా సీసీ డ్రెయిన్ నిర్మించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా కొత్తగా రెండు రోజులుగా మరో విషయం తెరపైకి వచ్చింది. రూల్ ఇస్ రూల్, రూల్స్ ఇస్ ఆల్ అన్న రీతిగా అంబేద్కర్ నగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం ఎదుట వేరే మండలానికి చెందిన వ్యక్తి స్థానిక నాయకుల అండదండలతో వ్యాపారం చేసుకునేందుకు షెడ్ నిర్మించి వ్యాపారం చేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కట్టడాన్ని వెంటనే తొలగించాలాంటూ పంచాయతీ పాలకవర్గంలోని పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చి వెంటనే అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా సోమవారం సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆక్రమణలు అడ్డుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉందని పాలకవర్గంలో కొందరు చెబుతున్నారు. గతంలో ఇదే స్థలంలో ఇద్దరు వితంతు పేద మహిళలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తుంటే సదరు పంచాయతీ పాలకవర్గం (ప్రస్తుత పాలకవర్గం కాదు) వారిని అనేక ఇబ్బందులు పెట్టి గుడిసెలు పీకేసి అక్కడ నుంచి బయటికు తోలేసిన విషయం స్థానికులకు తెలిసిందే. దీంతో గ్రామస్తులు వాళ్ల కోరూల్, వీళ్లకో పెట్టటం తప్పు కాదా? తప్పు తప్పే శుద్ధ తప్పే అని ప్రజలు అంటున్నారు.



అంబేద్కర్ నగర్ దగ్గర అక్రమ కట్టడం



ఫ్రీజర్ బాక్సులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

సమాజ సేవలతో ఆదర్శంగా నిలుస్తోన్న 'ఫ్లాష్'

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మధుర స్మృతులెన్నో మిగిల్చి భౌతికంగా దూరమైన మిత్రులను స్మరించుకోవడమనేది గొప్ప విషయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఒక్కరిగా సమస్యలు పరిష్కరించకపోవచ్చుగానీ, పది మంది కలిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్న సంకల్పంతో ఏర్పాటైన ఏలూరులోని ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థ సమాజ అవసరాలను గుర్తిస్తూ దానికి అనుగుణంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఫ్రెండ్‌షిప్ డే పురస్కరించుకుని ఏలూరులోని పోలీస్ కళ్యాణ మండపంలో ఆదివారం స్నేహహస్తం - ప్రకృతే మన నేస్తం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నేహితులుగా ఉంటూ మృతిచెందిన చిరకాల మిత్రులకు, ఇటీవల కాలంలో మృతిచెందిన మిత్రులకు స్మరణ పేరుతో ఘన నివాళులర్పించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. అదేవిధంగా ఫ్రీజర్ బాక్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ సమాజ సేవలతో అందరికీ ఆదర్శంగా నిలుస్తోన్న ఫ్లాష్ సంస్థను కొనియాడారు. ముఖ్యంగా ఫ్రెండ్‌షిప్ డేని పురస్కరించుకుని ఎంతోమంది అపూర్వ మిత్రులను స్మరించుకునే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. తన తండ్రి బడేటి శ్రీహరిరావు, ఆయన మిత్రుడు మామిళ్లపల్లి గంగరాజు వంటివారిని కూడా స్మరించుకునే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో పాటు మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జికి ఘన నివాళులర్పించారు. అలాగే మాజీ ఎంఎల్ఎ వంగవీటి మోహన్‌రంగా చిత్రపటం వద్ద ఆయన కుమారుడు, మాజీ ఎంఎల్ఎ వంగవీటి రాధా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కొండ్రెడ్డి విశ్వనాధం, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బడేటి వెంకట్రామయ్య, టిడిపి నాయకులు మామిళ్లపల్లి పార్థసారధి, మోటేపల్లి చంద్రశేఖర్, కొట్టు మనోజ్, అమరావతి అశోక్, యర్రంశెట్టి శ్రీనివాస్, పలువురు ఫ్లాష్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సాగుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రసాయన రహిత ప్రకృతి ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తులను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎఎస్‌పి కార్యాలయంలో ఆదివాసీ, గిరిజన సంఘాల ఉమ్మడి సమావేశం ఆదివారం ధర్ముల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి ఊకె ముత్యాలరావు, ఆదివాసీ మహా సభ్యురాలు మడకం సునీత, మడకం రజిని మాట్లాడుతూ దేశంలోని ఆదివాసీలపై ఈ మధ్య కాలంలో దాడులు పెరిగాయన్నారు. భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు 6, 5 షెడ్యూల్ ప్రాంతాలను కేటాయించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న అడవులు, వనరులు, ఖనిజ సంపద కొల్లగొట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఉన్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేయడానికి అనేక సవరణలు తీసుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు, మైనింగ్ పేరుతో ఆదివాసీ తెగలు అంతరించి పోవడానికి కారణమవుతున్నాయన్నారు. అభివృద్ధికి ఆధారమైన జిఒ 3ను ఉద్దేశపూర్వకంగా సుప్రీంకోర్టు కొట్టేస్తే ప్రభుత్వాలు స్పందించకపోవడం ఆదివాసీలను విస్మరించడమేనని విమర్శించారు. సిఎం చంద్రబాబు అరకు సభలో ఇచ్చిన హామీ ప్రకారం జిఒ 3కు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, చట్టాలు పూర్తిగా అమలవ్వాలంటే ఆదివాసీలందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన మండలంలోని రాజకీయ ప్రజా ప్రతినిధు లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఆదివాసీ ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొని ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని కోరారు.